సాక్షి చిత్తూరు

గురువారం । 20 । ఏప్రిల్ । 2023



కళాశాల ప్రగతిపై నాక్ అధ్యయనం

పట్టణంలోని డిగ్రీ కళాశాల ప్రగతిపై నాక్ కమిటీ అధ్యయనానికి బుధవారం శ్రీకారం చుట్టింది. నాక్ పీర్ టీమ్ అధ్యయనం గురువారం కొనసాగుతుందని ప్రిన్సిపాల్ తెలియజేశారు. - 8లో



చిరుధాన్యాలతో ఆరోగ్యం

చిరుధాన్యాల వంటకాలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆయన చిత్తూరులో బుధవారం ఫుడ్‌ఫెస్టివల్‌ను ప్రారంభించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	41	24
తిరుపతి	41	24
తిరుమల	36	21
గూడూరు	42	27
నగరి	42	26

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం(సా)	సహర్ శుక్రవారం(ఉ)
తిరుపతి	6.29	4.35
చిత్తూరు	6.31	4.35
పుంగనూరు	6.33	4.38

కంటిపాప భద్రమేనా?

మన కంటిపాప భద్రమేనా? ఈ కంటి చూపును రక్షించుకోవడానికి అప్రమత్తంగా ఉండాలి. ఎందుకంటే దారి చూపే నేత్రంపై గ్లకోమా దాడి చేస్తోంది. చడీ చప్పుడు లేకుండా కంటి చూపును దోచేస్తోంది. క్రమంగా దృష్టి తగ్గుతూ, చివరికి అంధత్వం వస్తోంది. గ్లకోమా దాడి చేసిన మొదట్లో పాక్షికంగా దృష్టిలోపం కనిపిస్తుంది. దానిని నిర్లక్ష్యం చేయకుండా సరైన చికిత్స తీసుకుంటే ఈ వ్యాధి దూరమవుతుంది. లేకుంటే కొన్నాళ్లకు కంటి చూపు పూర్తిగా దూరమవుతుంది. దీన్ని ప్రాథమిక దశలో గుర్తిస్తేనే వైద్యం సాధ్యమవుతుంది.



కంటిపరీక్షలు చేస్తున్న వైద్యురాలు



- జిల్లాలో పెరుగుతున్న గ్లకోమా బాధితుల సంఖ్య
- ప్రాథమిక దశలో గుర్తిస్తే ఇబ్బంది లేనట్టే
- ఏటా 12 వేల మందికి పరీక్షలు

చిత్తూరు రూరల్: జిల్లాలో ఒక జిల్లా ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రి 4, సీహెచ్‌సీలు 8, పీహెచ్‌సీలు 50, అర్బన్ హెల్త్ సెంటర్లు 49 దాకా ఉన్నాయి. ఇక్కడకు నిత్యం వేలాదిమంది పలు రకాల ఆరోగ్య సమస్యలతో వస్తుంటారు. అయితే శరీరంలో అతి ముఖ్యమైన సున్నితమైన భాగం కన్ను. ఈ కంటికి సంబంధించిన ఓపీ కోసం ప్రతి రోజు వందల సంఖ్యలో రోగులు వస్తున్నారు. ఇందులో ప్రధానంగా గ్లకోమా వ్యాధి లక్షణాలతో పదుల సంఖ్యలో కేసులు పుట్టుకొస్తున్నాయి. ఈ కేసులు ఏటా పెరగడంతో కంటి వైద్యులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు ఏ వయసు వారికైనా గ్లకోమా రావచ్చని తెలియజేస్తున్నారు. కొందరు పిల్లల్లో ఇది పుట్టుకతోనే ఉంటుంది. అనువంశికంగా కూడా వస్తోంది. హ్రస్వదృష్టి ఉండేవారిలో గ్లకోమా రావచ్చు. ముఖానికి స్టెరాయిడ్ పూత మందులు రాసుకునే వారిలో కూడా గ్లకోమా వచ్చే అవకాశాలు ఉన్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

లక్షణాలు ఇలా...

ప్రారంభంలో గ్లకోమాకు ఎటువంటి భయపెట్టే లక్షణాలూ కనిపించవు. ఈ వ్యాధికి తొలి లక్షణం.. పక్కచూపు మందగించడం. అయితే దీన్ని గుర్తించే సరికే వ్యాధి తీవ్రతరమవుతోంది. కంటి నరాల్లో ఒత్తిడి తీవ్ర స్థాయిలో ఉన్నప్పుడు హఠాత్తుగా కన్ను నొప్పి రావడం, తలనొప్పి రావడం, చూపు మసకబారడం, కాంతి రేఖ చుట్టూ వలయాలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. కంట్లో అసౌకర్యం కలగకపోవడం వంటి కారణాల వల్ల గ్లకోమాను చివరి దశ వరకూ గుర్తించలేరు. కొంచెం అప్రమత్తతతో కళ్లను ఎప్పటికప్పుడు పరీక్షించుకుంటూ గ్లకోమాను తొలి దశలోనే కనిపెట్టే ప్రయత్నం చేయాలి.

- వెలుగుతున్న బల్బును చూసినప్పుడు వాటి చుట్టూ రంగులు కనిపించటం తల బరువుగా ఉండటం.

ఆస్పత్రుల్లో సంబంధించిన ఓపీ వివరాలు

నెల	ఓపీ	గ్లకోమా బాధితులు
జనవరి	1812	41
ఫిబ్రవరి	2045	39
మార్చి	1854	47
ఏప్రిల్	1563	32

- చీకటిపడే సమయంలో కంట్లోని యాంగిల్ మూసుకుపోయి కంట్లో ఒత్తిడి పెరుగుతుండడం.
- కంట్లో ఒత్తిడి పెరిగి, కన్ను ఎరుపెక్కి, రెప్పలు వాచిపోయి విపరీతమైన నొప్పి రావడం
- కంటి చూపు దూరం క్రమేపీ తగ్గుతుంది. కొంత కాలానికి పూర్తిగా కుదించుకుపోయి దృష్టి పోతుంది.
- ఒక కన్ను మూసి రెండో కన్ను తెరచి చూసినప్పుడు మార్పు స్పష్టంగా తెలుస్తుంది.
- ఇలా కళ్లను పరీక్షించుకోవడం ద్వారా గ్లకోమాను ప్రారంభ దశలోనే గుర్తించవచ్చు. గ్లకోమా వ్యాధి వచ్చే అవకాశాలు వయసుతోపాటు పెరుగుతాయి. కాబట్టి 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ కంటి వైద్యుల్ని సంప్రదించి గ్లకోమా చెకప్ చేయించుకుంటూ ఉండాలి.

జాగ్రత్తలు పాటించాలి

- గ్లకోమాను నియంత్రించే అవకాశాలు లేకపోయినా కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి.
- వంశపారంపర్యంగా గ్లకోమా వచ్చే అవకాశం ఉన్నందున క్రమం తప్పక కంటి పరీక్షలు చేయించుకోవాలి.
- స్టెరాయిడ్స్ వాడకం పూర్తిగా తగ్గించాలి.
- ప్రతీ చిన్న రుగ్మతకు స్టెరాయిడ్ చుక్కల మందులు వాడకూడదు.
- రక్తపోటు, హైపర్ టెన్షన్‌ను అదుపులో ఉండేలా చూసుకోవాలి.
- మధుమేహ వ్యాధిగ్రస్తులు స్థాయిని అదుపులో ఉంచుకోవాలి.
- కళ్లకు దెబ్బలు తగలకుండా కాపాడుకోవాలి.
- టపాసులు కాల్చేటప్పుడు నిప్పురవ్వలు కంట్లో పడకుండా చూసుకోవాలి.
- కంట్లో ఒత్తిడి తగ్గేందుకు యోగా, వ్యాయామాలు చేయాలి.

కంటిపాపను కాపాడుకోవాలి



కంటిపాపను కాపాడుకోవాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కంటికి సంబంధించి చిన్న సమస్యను గుర్తించినా తక్షణం వైద్యులను సంప్రదించాలి. వారి సూచనల మేరకు మందులు వాడాలి. పరీక్ష ఫలితాల ఆధారంగా సర్జరీ చేయించుకోవాలి. ఈ వ్యాధి నివారణకు కావాల్సినన్ని మందులు, పరీక్ష పరికరాలు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– డాక్టర్ సుధ, కంటి వైద్య నిపుణులు

అభూత కల్పనలు అసత్య కథనాలు

- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మండిపాటు



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: అభూత కల్పనలు అసత్య కథనాలతో ప్రజలను మభ్యపెడుతూ, ఎల్లో మీడియా టీడీపీకి తొత్తుగా వ్యవహరిస్తోందని ఉప ముఖ్యమంత్రి కే.నారాయణస్వామి అన్నారు. సంఘ విద్రోహ శక్తులను ప్రోత్సహించి ఎలాగైనా అధికారం పొందాలని చంద్రబాబు చేస్తున్న కుటిల రాజకీయాలను ప్రజలు ఛీ కొడుతున్నారని చెప్పారు. మండలంలోని అల్లంవారికండ్రిగ గ్రామంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సంపన్నుల కోసం పనిచేస్తున్న చంద్రబాబు పేద ప్రజలకు సంక్షేమ పథకాలు దరిచేరనీయకుండా కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. గ్రామాల్లో నాటు సారా తయారీ వలన అమాయక కుటుంబాలు చితికి పోతుంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాటు సారా కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకుని పేదల కుటుంబాలకు బాసటగా నిలిచినట్లు చెప్పారు. నవరత్నాల ద్వారా సంక్షేమ పథకాలు అందించి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. 14 యేళ్లుగా ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఏ ఇంటికీ, ఏ ఒక్క పేదవాడికైనా సాయం చేశారా అని ప్రశ్నించారు. గ్రామాల్లో కెళ్లి ఓట్లు అడిగితే ప్రజలు తిరుగుబాటు చేస్తారని చెప్పారు. తనపై ఎన్ని దుష్ప్రచారాలు చేసినా భయపడనని, ప్రాణం ఉన్నంత వరకూ పేదవాడి కోసం పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. జగనన్న ఉన్నంత వరకూ తనను ఎవరూ ఏమీ చేయలేరని చెప్పారు.

న్యూస్‌రీల్

పకడ్బందీగా రీ సర్వే



రీ సర్వే పనులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

వి.కోట: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీ సర్వే పనులు పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన బుధవారం శివునికుప్పం గ్రామంలో చేపడుతున్న భూ రీసర్వే పనులను పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం తనిఖీ చేశారు. రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ భూ రీ సర్వే చేపట్టిన గ్రామాల్లో సరిహద్దురాళ్ల నాటే ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ హక్కు పత్రాలు పంపిణీ చేయాలని ఆదేశించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై విచారణ పూర్తి

చిత్తూరు రూరల్: మెడికల్ ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు ఫిర్యాదుపై విచారణ పూర్తయింది. రెండు రోజులపాటు విచారణ చేపట్టిన అధికారులు బుధవారం డీసీహెచ్‌ఎస్ బీఎస్‌కే నాయక్‌కు నివేదిక సమర్పించారు. జిల్లా వైద్యవిధాన పరిషత్‌లో గత కొంతకాలంగా మెడికల్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన బిల్లులు పెండింగ్ పెడుతున్నారని..ఇందుకు డబ్బులు వసూళ్లు చేస్తున్నారని ఇటీవల ఆంజనేయులు, నాగేశ్వర్ అనే పేరుతో స్పందనలో అర్జీ నమోదైంది. ఈ ఫిర్యాదు సీఎంఓ ఆఫీసుకు వెళ్లడంతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ విచారణకు ఆదేశించారు. మదనపల్లె ఆస్పత్రికి చెందిన వైద్యులు ఆంజనేయులు, దివాకర్‌బాబు, పలమనేరు వైద్యులు పణిభూషణ్‌ను విచారణ అధికారులుగా నియమించారు. ఈ మేరకు అధికారులు లోతుగా విచారించారు. ఎప్పటి నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి? ఎందుకు ఇలా చేశారు? రీయింబర్స్ మెంట్‌కు వచ్చే వారిని బస్టాండుకు తీసుకెళ్లి డబ్బులు వసూళ్లు చేస్తున్న విషయం వాస్తవమేనా? ఇంత జరుగుతున్నా అధికారులు ఏం చేస్తున్నారనే విషయాలపై పూర్తి స్థాయిలో ఆరా తీశారు. రీయింబర్స్‌మెంట్ విషయంలో కార్యాలయ అధికారుల పర్యవేక్షణ లోపించిందనే గుర్తించారు. ఫిర్యాదు చేసిన వ్యక్తుల చిరునామా, ఫోన్ నెంబరు నమోదు చేయకపోవడంతో విచారణ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేయలేకపోయారని తెలిసింది. ఈ ఫిర్యాదులో ఓ క్లర్క్ పేరును ప్రస్తావించినట్లు సమాచారం.

పది మూల్యాంకనం ప్రారంభం



మూల్యాంకన ప్రక్రియపై సూచనలిస్తున్న జేడీ మువ్వారామలింగం

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల మూల్యాంకనం బుధవారం ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో మూల్యాంకనానికి పక్కాగా ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు సంబంధిత సబ్జెక్టుల్లో టీచర్లు మూల్యాంకన విధులకు హాజరయ్యారు. అబ్జర్వర్‌గా విచ్చేసిన జేడీ సర్వీసెస్ మువ్వారామలింగం మూల్యాంకన ప్రక్రియను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. విధులు కేటాయించిన ప్రతి ఒక్కరూ నిబంధనలను అనుసరించి జవాబుపత్రాలను దిద్దాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే శాఖాపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఈవో విజయేంద్రరావు మాట్లాడుతూ ఎలాంటి పొరబాట్లు చోటుచేసుకోకుండా మూల్యాంకనం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీవైఈవో చంద్రశేఖర్, జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గురుస్వామిరెడ్డి, ఎంఈవో అరుణాచలరెడ్డి, హెచ్‌ఎంలు రమేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌ఓకు ఉద్యోగోన్నతి

చిత్తూరు రూరల్: చిత్తూరు జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో ఏఎస్‌ఓగా పనిచేస్తున్న శేషాచలం రాజుకు డీఎస్‌ఓగా ఉద్యోగన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయనను తిరుపతి డీఎస్‌ఓగా బదిలీ చేసింది.

సంక్షేమ పాలనకే ప్రజల మద్దతు

- క్రీడలు, పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా



మంత్రి రోజాను ఆప్యాయంగా పలకరిస్తున్న వృద్ధురాలు

నగరి : సంక్షేమ పాలనకే ప్రజలు మద్దతు తెలుపుతున్నారని రాష్ట్ర క్రీడలు, పర్యాటక శాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. నగరి మున్సిపాలిటీ 26వ వార్డు పద్మావతి నగర్‌లోను, 8వ వార్డు కీళపట్టు బీసీ కాలనీలోను బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంత్రి నిర్వహించారు. ప్రతి గడపలోను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలు వింటూ అక్కడికక్కడే అధికారుల ద్వారా వాటికి పరిష్కార మార్గం చూపుతూ ముందుకు సాగారు. పథకాల లబ్దిదారులకు ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమాన్ని వివరించారు. ఆమె మాట్లాడుతూ సంక్షేమ పాలనకే ప్రజలు అండగా ఉన్నారని గడప గడపలోను అది స్పష్టమౌతోందని అన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీలకు పెత్తనం కట్టబెట్టి అర్హులకు కూడా సంక్షేమ పథకాలు అందించలేదని ఆరోపించారు. ప్రస్తుతం అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందిస్తున్నట్లు గుర్తుచేశారు. జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుంటేనే పేదలకు న్యాయం జరుగుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపారు. అధికారం ఉన్నప్పుడు పేద రాష్ట్రం అంటూ బుకాయించిన టీడీపీ నాయకులు ఎన్నికలు సమీపిస్తుండడంతో మళ్లీ మాయ మాటలు చెప్పి మభ్యపెట్టడానికి వస్తున్నారన్నారు. అయితే వారిని నమ్మే పరిస్థితిలో జనం లేరని చెప్పారు. ఎవరు మంచి చేస్తున్నారో, ఎవరు ఏమార్చి వెళ్లారో వారికి స్పష్టంగా అర్థమవుతోందన్నారు.

మా ఇంట ఫ్యాను గాలి

మా ఇంట ఫ్యానుగాలి చల్లగా వీస్తోందని పద్మావతి నగర్‌కు చెందిన కె.వెంకటేశులు మంత్రికి వివరించారు. తాము ప్రభుత్వ సహకారంతో ఇల్లు కట్టుకొని అందులోనే ఉంటున్నామన్నారు. దీంతోపాటు అమ్మ ఒడి, ఆసరా, చేయూత, పింఛన్, సున్నా వడ్డీ, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.13.39 లక్షల లబ్ధి చేకూరిందని చెప్పారు. జగనన్న చలువతో మా ఇంట చల్లని ఫ్యాను గాలి వీస్తోందని ఇంటికి అతికించివున్న జగనన్న స్టిక్కర్‌ను చూసి చెప్పడం, సంక్షేమ బుక్‌లెట్ ఇవ్వగానే ఇంట్లో చిన్నారి ముఖ్యమంత్రి చిత్రపటాన్ని ముద్దాడడం ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, కౌన్సిలర్లు ఇంద్రయ్య, అణ్ణెమ్మ, అమర్, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, మెప్మా టీఎల్‌ఎం సునీత, ట్రాన్స్‌కో ఏఈ మోహన్, మున్సిపల్ డీఈ నరేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో నాగసాధువులు



కమిటీ చైర్మన్‌ను ఆశీర్వదిస్తున్న నాగసాధువులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం హరిద్వార్‌కు చెందిన నాగసాధువులు దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో తీర్థప్రసాదాలు, స్వామి అమ్మవార్ల జ్ఞాపికలు అందజేశారు.

సేవకు సలాం

- జిల్లాలో 8,408 మంది వలంటీర్లకు పురస్కారాలు



చిత్తూరు ఆస్పత్రిలో పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ వేద(ఫైల్)

చిత్తూరు కార్పొరేషన్: నిస్వార్థంగా ప్రజల ముంగిట్లో సేవలందిస్తున్న వలంటీర్ల సేవకు ప్రభుత్వం ఏటా పురస్కారాలు అందిస్తోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరిక అందుతున్నాయంటే అందులో వలంటర్ల పాత్రే కీలకం. దీంతోపాటు వలంటీర్ల పరిధిలో తలెత్తిన సమస్య పరిష్కారానికి సైతం వారు చేస్తున్న కృషి అభినందనీయం. ప్రజలకు అధికారులకు మధ్య ఈ వలంటీర్లు వారధిలా పనిచేస్తున్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి తగిన సమాచారాన్ని అందజేస్తూ ప్రశంలందుకున్న ఈ వలంటీర్లను ప్రభుత్వం ఏటా వారి కృషికి తగినట్లు పురస్కారాలు అందించి గౌరవిస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది మొత్తం 8,408 మందికి రూ.8.65కోట్ల నగదు బహుమతి ఇవ్వనుంది. వలంటీర్ల పనితీరును బేరీజు వేసి వివిధ రకాల అవార్డులకు ఎంపిక చేయనున్నారు. వారిని సన్మానించడంతో పాటు ఆర్థిక ప్రోత్సాహకాలను అందజేయనున్నారు. జిల్లాలో మొత్తం 9,346 మంది వలంటీర్లు ఉండగా అందులో 244 ఖాళీలు ఉన్నాయి. వీరిలో ఏడాది పాటు విధులు నిర్వహించిన 8,408 మందికి అవార్డులు ఇవ్వనున్నారు.

31 మందికి సేవావజ్ర

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ సేవలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వలంటీర్లకు సేవా వజ్ర అవార్డును అందజేయనున్నారు. జిల్లాలో మొత్తం 31 మందిని ఎంపిక చేయాల్సి ఉంది. వీరికి ఒకొక్కరికి రూ.30 వేలు ప్రోత్సాహం అందించి శాలువతో సన్మానం చేయనున్నారు. ఈ లెక్కన వీరందరికీ రూ.9.3 లక్షల నగదు, ప్రశంసాపత్రాన్ని, మెడల్, బ్యాడ్జిని అందజేయనున్నారు.

182 మందికి సేవారత్న

ప్రతి మండలం, మున్సిపాలిటీ నుంచి ఒక్కో వలంటీర్‌ను సేవారత్న పురస్కారానికి ఎంపిక చేయనున్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.20వేల నగదు, ప్రశంసాపత్రం అందజేయనున్నారు. జిల్లాలో మొత్తం 182 మందికి రూ.36.4 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది.

8195 మందికి సేవామిత్ర

వలంటీరుగా విధుల్లో చేరి ఏడాదికి పైగా సేవలందించి, ఎటువంటి ఫిర్యాదులేని ప్రతి వలంటీర్‌కు సేవామిత్ర పురస్కారం ఇవ్వనున్నారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు నగదు, బ్యాడ్జి శాలువాతో సత్కరించనున్నారు. జిల్లాలో ఈ అవార్డుకు 8195 మంది అర్హత కలిగిన వలంటీర్లు ఉన్నారు. వీరికి రూ.8.19 కోట్లు ఇవ్వనున్నారు.

త్వరలో సమావేశం



ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాక కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో సమావేశాలు నిర్వహించనున్నాం. వచ్చే నెలలో కార్యక్రమం జరిగే అవకాశాలు ఉంది. ఎంపికైన వారికి పురస్కారాలు అందజేయనున్నాం.

– ప్రభాకర్‌రెడ్డి, సీఈఓ, జెడ్పీ, చిత్తూరు

ఫుడ్‌కోర్టు నిర్వహణకు దరఖాస్తులు

చిత్తూరు అర్బన్: నగరంలోని పోలీస్ గెస్ట్ హౌస్‌లో ఉన్న పోలీస్ ఫుడ్ కోర్టును లీజుకు ఇవ్వనున్నట్లు పోలీసు శాఖ అధికారులు తెలిపారు. లీజుకు తీసుకునేందుకు ఆసక్తి గలవారు చిత్తూరు ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయాన్ని లేదా 9440900747ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

వరసిద్ధుని సేవలో ఆర్టీసీ చైర్మన్



ఆర్టీసీ చైర్మన్‌కు స్వామివారి చిత్రపటం ఇస్తున్న చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ఉదయం ఆయన స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ రవీంద్రబాబు, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బోయకొండలో నిరంతర విద్యుత్

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయం, పరిసర ప్రాంతాలకు త్వరలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయనున్నారు. ఈ మేరకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్ బుధవారం తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లె సబ్‌స్టేషన్ నుంచి బోయకొండ సబ్‌స్టేషన్ వరకు 33 కేవీ సామర్థ్యంతో ప్రత్యేకంగా అదనపు లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రూ.80 లక్షల వ్యయంతో 9 కిలోమీటర్ల దూరం ప్రత్యేక విద్యుత్ లైను ఏర్పాటు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వాహనాలకు లైన్లు తగలకుండా 28 అడుగుల ఎత్తులో విద్యుత్ లైన్లు ఏర్పాటుచేశారు.160 స్తంభాలను ఏర్పాటుచేసి 11 ప్రదేశాల్లో టవర్లు సైతం ఏర్పాటు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



గుడుపల్లె: మండలంలోని కాడేపల్లెలోని డీలర్ షాపు నుంచి కర్ణాటకకు తరలిస్తున్న చౌక బియ్యాన్ని ఎస్ఐ లక్ష్మీకాంత్ పట్టుకున్నారు. కర్ణాటకలోని తొప్పనపల్లెకు చెందిన రామకృష్ణ మండలంలోని కాడేపల్లి డీలర్ రఘురామ్ చౌకదుకాణంలో 550 కిలోల బియ్యం కొనుగోలు చేసి కర్ణాటకకు పంపిస్తున్నాడు. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో కర్ణాటక సరిహద్దులోని పెద్దగొల్లపల్లి వద్ద తనిఖీలు చేపట్టారు. ఓమ్నీ వ్యానులో తరలిస్తున్న 550 కిలోల బియ్యం పట్టుకున్నారు. డీలర్ రఘురామ్ బియ్యం కిలో రూ.12 ప్రకారం వ్యాపారికి అమ్మినట్లు చెప్పారు. దీంతో గుడుపల్లె పోలీసులు కేసు నమోదు చేసి బియ్యాన్ని, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ప్రభుత్వాస్పత్రిలో పసికందు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటున్న బాధితులు
- సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసిన వైనం
- విచారణకు ఆదేశించిన ఉన్నతాధికారి



బాధిత కుటుంబ సభ్యులను విచారిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్

చిత్తూరు రూరల్: జిల్లా ఆస్పత్రి ప్రసూతి విభాగంలోని వైద్య సిబ్బంది నిర్లక్ష్యం పరాకాష్ఠకు చేరింది. వీరి నిర్లక్ష్యానికి బుధవారం ఓ పసికందు కళ్లు తెరిచిన కొద్దిసేపటికే మృత్యువాత పడింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులు సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు, చిత్తూరు నగరం టెలిఫోన్ కాలనీకి చెందిన గర్భిణి సమీమ్ మంగళవారం రాత్రి 9.30 గంటల సమయంలో పురిటినొప్పులతో జిల్లా ఆస్పత్రిలో చేరింది. అప్పటికే భరించలేని నొప్పి ఉందని బాధితురాలు అక్కడే ఉన్న వైద్య సిబ్బందితో చెప్పినా వారు పట్టించుకున్న పాపనపోలేదు. దీనిపై బంధువుల సాయంతో ఓ అధికారికి ఫిర్యాదు చేయడంతో సిబ్బందికి మరింత కోపం వచ్చింది. ''అసలు వైద్యమే చేయం ఏం చేస్తావో చేసుకో'' అంటూ సిబ్బంది పూర్తిగా ముఖం చాటేశారు. అయితే ఎట్టకేలకు బుధవారం ఉదయం 9గంటలకు పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తొలికాన్పులోనే మగపుట్టాడని ఆ కుటుంబ సభ్యులు ఆనందంలో మునిగిపోయారు. ఇంతలోనే ఆ బిడ్డకు శ్వాసలో ఇబ్బంది ఉందంటూ సిబ్బంది ఐసీయూ వార్డుకు తీసుకెళ్లారు. అంతే 15 నిమిషాల్లోనే బిడ్డకు ఊపిరి ఆడలేదని, ఉమ్మినీరు తాగిందని, హార్ట్ వీక్‌గా ఉందంటూ కారణాలు చెప్పి, చివరిగా బిడ్డ చనిపోయిందని వెల్లడించారు. దీంతో బిడ్డ బంధవులు షాక్‌కు గురయ్యారు. ఒక్కోసారి ఒక్కో కారణం చెప్పడంతో బాధిత కుటుంబ సభ్యులు వైద్యులను నిలదీశారు. బిడ్డను కావాలనే చంపేశారని ఆరోపించారు. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. వైద్య సిబ్బందే మా బిడ్డను చంపేశారంటూ రోదించారు. వెంటనే కుటుంబ సభ్యులు సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేయడంతో ఆ విభాగానికి చేరుకుని పసికందు మృతిపై ఆరా తీశారు. బాధితులను విచారించారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపడుతామని, నిర్లక్ష్యం ఉంటే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

అసలేం జరుగుతోంది..

ప్రసూతి విభాగంలో నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లు కనిపించినా అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్న ప్రతి ఒక్కరిలోనూ మెదులుతోంది. అక్కడి సిబ్బంది దౌర్జన్యం అంతా కాసులు చేతులో పడేవరకు ఉంటుందని, కాసులిస్తే మాత్రం చల్లబడతారన్న ఫిర్యాదులు ఎన్నో ఉన్నాయి. రెండు నెలల క్రితం బిడ్డకు జన్మనిచ్చిన తల్లి చనిపోవడం, ప్రభుత్వ ఆస్పత్రి రెఫర్ చేయడంలో ప్రైవేటు ఆస్పత్రిలో చేరిన గర్భిణికి సుఖ ప్రసవం కావడం, తాజాగా పసికందు మృతి చెందడం ఇక్కడి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యానికి సాక్ష్యాలు. వీటిపై విచారణ చేపట్టిన అధికారులు కూడా, వైద్యులకు, సిబ్బందికి అనుకూలంగా నివేదికలు పంపడం పరిపాటిగా మారిపోయింది. ఇక్కడ సాకులు వెతికి పెట్టడంలో కొంత మంది వైద్యులు పండిపోయారనే విమర్శలు వస్తున్నాయి. ఇది తెలిసినా ఉన్నతాధికారులు ఆ విభాగంలో మార్పు తీసుకురావాలనే ప్రయత్నం మాత్రం చేయడం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు కళ్లు తెరిచి ప్రసూతి విభాగంలో జరుగుతున్న నిర్లక్ష్యపు జబ్బుకు వైద్యం చేయాలని ప్రజలు కోరుతున్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,700

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.78

కళాశాల ప్రగతిపై నాక్ అధ్యయనం



పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేస్తున్న ప్రిన్సిపల్

నగరి : పట్టణంలోని డిగ్రీ కళాశాల ప్రగతిపై నాక్ కమిటీ పూర్తిస్థాయి అధ్యయనానికి బుధవారం శ్రీకారం చుట్టింది. దీనికోసం నేషనల్ అసెస్‌మెంట్, అక్రెడిటేషన్ కౌన్సిల్ (నాక్) పీర్ టీమ్ చైర్మన్ శైలేష్ జలా, కో–ఆర్డినేటర్లు ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఉజ్వల్ కె.సింగ్, పోప్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ అయ్యపిళ్లై సెల్వకుమార్ బుధవారం డిగ్రీ కళాశాలలో పర్యటించారు. కళాశాల విద్యాశాఖ ప్రతినిధిగా కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్ పి.బాబు హాజరయ్యారు. రెండు రోజులు నిర్వహించే అధ్యయనంలో భాగంగా నాక్ పీర్ టీమ్‌కు ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ ఐదేళ్లలో కళాశాల సాధించిన అభివృద్ధిని పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కళాశాలలోని అన్ని విభాగాలను సందర్శించిన వసతులు, నాణ్యత ప్రమాణాలను నాక్ టీం పరిశీలించింది. విద్యార్థులతోను, పూర్వ విద్యార్థులతో, విద్యార్థుల తల్లిదండ్రులతోను చర్చించి వారి అభిప్రాయాలను, సూచనలను, సమాచారాన్ని సేకరించింది. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నాక్ పీర్ టీమ్ అధ్యయనం గురువారం కూడా కొనసాగుతుందని ప్రిన్సిపాల్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ భాస్కర రాజు, ఐక్యూ కో–ఆర్డినేటర్ మురళి మోహన్ రెడ్డి, అకడమిక్ కో ఆర్డినేటర్ వేణుగోపాల్, ఎన్‌సీసీ అధికారి భాస్కర్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గోపి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇద్దరు అరెస్టు

గంగవరం: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు మండలంలోని పశుపత్తూరు కురప్పల్లికి చెందిన వెంకటేష్, కిరణ్ తమ ద్విచక్ర వాహనాల్లో రూ.50 వేలు విలువ చేసే మద్యం టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కురప్పల్లి సమీపంలో ఇద్దరినీ అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

దత్తత గ్రామంలో మంత్రి రోజా ఇఫ్తార్ విందు

- ఇంటి బిడ్డలా ఆప్యాయత కురిపించిన గ్రామస్తులు
- ముస్లింలపై అభిమానం చాటుకున్న మంత్రి
- 2,380 కుటుంబాలకు రంజాన్ కానుక



ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి ఆర్కే రోజా

నగరి : పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని మండలంలో తాను దత్తత తీసుకున్న మీరాసాహెబ్ పాళెంతో పాటు, వేలావడి గ్రామంలో ఉన్న ముస్లింలకు బుధవారం మంత్రి ఆర్కేరోజా ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. మీరాసాహెబ్ పాళెంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో గ్రామస్తులతో కలిసి మంత్రి పాల్గొన్నారు. దత్తత తీసుకొని మరుగున పడిన గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మంత్రి రోజాపై అభిమాన జల్లు కురిపించారు. దీంతోపాటు రంజాన్ వేడుకలకు మరింత ప్రాధాన్యం తెస్తూ తమ గ్రామంలో మంత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడంలో ముస్లింలు ఆనందోత్సాహాల్లో మునిగితేలారు. గత చరిత్రలో ఏ రాజకీయ నాయకుడు ముస్లింలపై ఇంతగా అభిమానం చూపలేదని ఇంతటి అభిమానానికి తాము ఏమిచ్చి రుణం తీర్చుకోగలమంటూ రోజాకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి ఇచ్చిన ఇఫ్తార్ విందుతో తమ గ్రామాలకు ముందుగానే రంజాన్ కళ వచ్చిందని ఇది అల్లాహ్ తమకు ఇచ్చిన ఆశీస్సులుగా భావిస్తున్నామంటూ ఉప్పొంగి పోయారు. మీరాసాహెబ్ పాళెం, వేలావడి గ్రామాల్లోని 2,380 కుటుంబాలకు పార్టీ శ్రేణుల ద్వారా విందు, చీరను పంపిణీ చేశారు. మీరాసాహెబ్ పాళెంలో మంత్రి మాట్లాడుతూ గతంలో ఎన్నికల సమయంలో ఒకరోజు మీరాసాహెబ్ పాళెంలో నిద్రించగా, ఆరోజు ప్రజల కష్టాలు తెలిశాయని చెప్పారు. అందుకే అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాన్ని దత్తత తీసుకుని, రోడ్లు, బోరు, విద్యుత్ స్తంభాలు వేయించడంతోపాటు, ఇల్లులేని వారికి ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం ముస్లింలపై ఎన్నికల సమయంలోనే అభిమానం కురిపించేదని, ఆ తరువాత ముఖం చాటేసేదని గుర్తుచేశారు. వైఎస్ కుటుంబం మాత్రమే ముస్లిం మైనారిటీల అభివృద్ధిని ఆకాంక్షించారని, తాను కూడా వారి మార్గంలోనే నడుస్తున్నానని చెప్పారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



చిరుధాన్యాల వంటకాలను పరిశీలిస్తున్న కలెక్టర్ దంపతులు

చిత్తూరు అగ్రికల్చర్: చిరుధాన్యాల వంటకాలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని కలెక్టర్ నగిలి షణ్మోహన్ తెలిపారు. స్థానిక జిల్లా సమాఖ్య ఆవరణలోని టీటీడీసీ శిక్షణా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన చిరుధాన్యాల ఫుడ్ ఫెస్టివల్‌ను ఆయన ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు చిరుధాన్యాలతో ఆహార పదార్థాలను తయారు చేయడం మంచి పరిణామమన్నారు. వంటకాలు చాలా రుచిగా ఉన్నాయని కితాబిచ్చారు. ఆరోగ్య సంరక్షణకు చిరుధాన్యాల వంటకాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. పలమనేరు, గుడిపాల, బంగారుపాళ్యం, గంగాధరనెల్లూరు, చిత్తూరు రూరల్, పూతలపట్టు, ఐరాల, పులిచెర్ల మండలాల సమాఖ్యల సభ్యులు ఈ ఫుడ్ ఫెస్టివల్‌కు హాజరయ్యారు. వీరు రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు, అండుకొర్రలు, సామలు, ఊదరలు, అరికెలతో తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు. ఈ వంటకాలను కలెక్టర్ దంపతులతో పాటు ట్రైనీ కలెక్టర్ వై.మేఘస్వరూప్, డీఆర్ఓ రాజశేఖర్, డీఆర్‌డీఏ పీడీ తులసి రుచి చూసి డ్వాక్రా మహిళలను ప్రశంసించారు. అనంతరం మన చిరుధాన్యాలు–మన వంటకాలు పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణే లక్ష్యం

- జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో చైర్మన్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వేదికపై సీఈఓ ప్రభాకర్‌రెడ్డి


చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో నీటి ఎద్దడి నివారణే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం సీఈఓ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నీటి సమస్య ఉండే ప్రాంతాలను నమోదు చేసుకొని అక్కడ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రజాప్రతినిధులు, అధికారులు చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయానికి అంతరాయం లేని విద్యుత్ సరఫరాను అందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలిస్తే వలసవెళ్లే వారు తగ్గుతారని చెప్పారు. ఉపాధి హామీ పనిదినాలు పెంచేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంపై మరింత ప్రచారం కల్పించి సేవలు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాల్లో వేగం పెంచాలని స్పష్టం చేశారు.

స్త్రీ శిశు సంక్షేమానికి కృషి

స్త్రీ శిశు సంక్షేమానికి కృషి చేయాలని మహిళ శిశు సంక్షేమశాఖ స్థాయీ సంఘం చైర్మన్ భారతి కోరారు. పిల్లలు, గర్భిణుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తల్లిదండ్రులు లేని పిల్లల కోసం వాత్సల్య పథకం తీసుకువచ్చినట్లు గుర్తుచేశారు. తల్లిదండ్రులు లేని పిల్లల భవిష్యత్‌కు ప్రభుత్వం అందించే ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య అన్నారు. జిల్లాలో బడుగు, బలహీన వర్గాలు, మైనారిటీల సంక్షేమ కోసం చేస్తున్న అభివృద్ధిపై అధికారులు నివేదికను సమర్పించారు. వేసవిలో పశుగ్రాసం కొరత లేకుండా చూడాలని జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి కోరారు. డ్రిప్ పథకాన్ని అర్హులకు అందే విధంగా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

నేవీ ర్యాలీలో అద్భుత ప్రతిభ

- 23 మంది ఎస్వీ డిఫెన్స్ అకాడమీ విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎస్వీ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ శేషారెడ్డి

తిరుపతి రూరల్: ఇటీవల వైజాగ్‌లో నిర్వహించిన నేవీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో తిరుపతిలోని ఎస్వీ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపి 23 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఆ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతిలోని అకాడమీ క్యాంపస్‌లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా శేషారెడ్డి మాట్లాడుతూ అకాడమీలో నాణ్యమైన విద్యతో పాటు శారీరక దృఢత్వం పెంచేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను సత్కరించి, వారికి మెమెంటోలు అందించారు.